క్లుప్తంగా

మీడియాపై ఆంక్షల పోస్టర్లు తొలగింపు



ఆసుపత్రి గోడపై అంటించిన పోస్టర్లను తొలగిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా ఆసుపత్రికి మీడియా అనుమతిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇటీవల ఆంక్షలు విధిస్తూ ఆసుపత్రి నోటీసు బోర్డుపై వేసిన పోస్టర్లను శనివారం సాయంత్రం సిబ్బంది తొలగించారు. ఆంక్షలపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు జర్నలిస్టు సంఘాలు ఫిర్యాదు చేయగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు సిద్ధమయ్యాయి. దీంతో దిగివచ్చిన ఆసుపత్రి అధికారులు గోడలపై అంటించిన పోస్టర్లను తొలగించారు.

క్రీడా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



పరిచయం చేసుకుంటున్న రాజమల్లు

రెబ్బెన: సింగరేణి ఉద్యోగ క్రీడాకారులు క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ పోటీల్లో ముందుకు సాగాలని ఎస్వోటూజీఎం రాజమల్లు అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో డిపార్టుమెంటల్ కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించాలన్నారు. సింగరేణి ఉద్యోగ క్రీడాకారులు కోల్ ఇండియా పోటీల్లో రాణించి పతకాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి ప్రశాంత్, గుర్తింపు సంఘం నాయకులు రాజేశ్, కోఆర్డినేటర్ అన్వేష్, జనరల్ కెప్టెన్ కిరణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఐ చొరవతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న సీఐ

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని పాత ఆర్టీవో కార్యాలయం ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా చెడిపోయి గుంతలమయంగా మారడంతో స్పందించిన సీఐ బాలాజీ వరప్రసాద్ దగ్గరుండి రోడ్డుకు మరమ్మతులు చేయించారు. రోడ్డుపై గుంతలను పూడ్చి వేయించారు.

పాఠశాలలో ఎన్నికలు



ఓటు వేస్తున్న విద్యార్థినులు


ఆసిఫాబాద్అర్బన్: విద్యార్థుల క్రమశిక్షణ మెరుగుపర్చేందుకు ఉద్దేశించిన స్టూడెంట్స్ కౌన్సిల్ ఎన్నికలను శనివారం మండలంలోని గుండి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు. సాధారణ ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణను కళ్లకు కట్టినట్లు చూపించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రేరేపించి ఎన్నికలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రజాస్వామ్యంపై అవగాహన పెంచడంతో పాటు వారికి నమ్మకం కలిగేలా ఉండేందుకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్, మూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె..!

- రేపటి నుంచి ప్రారంభం
- విజయదశమి రోజున శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవం
- వేలాదిగా తరలిరానున్న భక్తజనం



సిర్పూర్ (టి)లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరాలయం



ఆలయంలోని విగ్రహాలు

సిర్పూర్(టి): దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని ఏటా మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వరాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు వేళైంది. శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ, హిందూ ఉత్సవ సమితిల ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు రేపటి నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఆలయంలో గత 800 సంవత్సరాల నుంచి దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చరిత్ర చెబుతోందని ఆలయ ప్రధాన అర్చకుడు గంగు సత్యనారాయణ శర్మ పేర్కొంటున్నారు.

ఈనెల 22 నుంచి..

శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో ఈనెల 22 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 22 పాడ్యమిన పల్లకి సేవ, ఈనెల 23 విదియన కల్పవృక్ష వాహన సేవ, ఈనెల 24 తదియన సూర్య ప్రభ వాహన సేవ, ఈనెల 25 చవితిన హంస వాహన సేవ, ఈనెల 26 పంచమిన శేష వాహనము సేవ, ఈనెల 27 షష్టిన హనుమంత వాహనము సేవ, ఈనెల 28 సప్తమిన అశ్వ వాహనము సేవ, ఈనెల 29 అష్టమిన గజ వాహనము సేవ, ఈనెల 30 నవమిన సింహ వాహనము సేవ, అక్టోబరు 01 నవమి తత్కాల దశమిన గరుడ వాహనము సేవ, అక్టోబరు 2 విజయదశమి నాడు రథోత్సవం, శ్రీనివాస కల్యాణ మహోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. ప్రతీరోజు రాత్రి 7.30 గంటల నుంచి వాహన సేవ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

తిరుమలను తలపించేలా..

తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలను తలపించేలా మండలకేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 02 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. అక్టోబరు 02న విజయదశమి రోజున శ్రీ శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం, రథోత్సవం, రావణాసుర దహన కార్యక్రమం, జమ్మి పూజలతో ఉత్సవాలు ముగించనున్నారు. ప్రతీరోజు స్వామివారి ఊరేగింపులో భక్తులు భజన, కోలాటాలు ఆడుతూ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రత్యేకంగా మహిళలు నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పాటు ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆటలు ఆడనున్నారు.

అంగరంగ వైభవంగా..



శ్రీ బాలాజీ వేంకటేశ్వరాలయంలో ఏటా బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు మండల ప్రజలతో పాటు సమీప మండలాల భక్తులు, మహారాష్ట్రలోని వివిధ పట్టణాల నుంచి భక్తులు తరలివస్తారు. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుంటారు.

– పైడి శ్రీకాంత్, సిర్పూర్(టి)

భక్తిశ్రద్ధలతో పూజలు



ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. బ్రహ్మోత్సవాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొంటారు. బతుకమ్మ ఆటలు ఆడుతారు. వివిధ రకాల బతుకమ్మలను పేర్చి బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకుంటారు.

– ఎల్ములే కిశోర్, సిర్పూర్(టి)

ఖాళీ బిందెలతో రాస్తారోకో

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని వంజీరి గ్రామంలో వారం రోజుల పాటు మిషన్ భగీరథ ద్వారా మంచినీరు రాకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో శనివారం కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో కోట ప్రసాద్ అక్కడికి చేరుకుని గ్రామానికి మంచినీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ రాస్తారోకో చేయడం సరికాదన్నారు. నీరు సరిపోకపోతే అదనంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. సీఆర్‌నగర్, మహాజన్‌గూడ గ్రామాల్లో బోరుబావులు లేనందున బోరుబావులు మంజూరు చేయాలని మహిళలు ఎంపీడీవోను కోరడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. భగీరథ అధికారులు మంచినీరు రావడం లేదన్న స్పందించడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

భిక్షాటనతో డైలీవేజ్ కార్మికుల నిరసన



జుబ్లీ మార్కెట్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష 9వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా శనివారం పట్టణంలోని జుబ్లీ మార్కెట్‌లో కార్మికులు వ్యాపారుల వద్దకు వెళ్లి భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీకం ప్రభాకర్ మాట్లాడుతూ గిరిజన హాస్టల్ వర్కర్‌లకు ఏడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారని, వేసవి కాలంలో కూడా వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కృష్ణమాచారి, వసంత్, రాంబాయి, కోటయ్య, సదాశివ్, లక్ష్మణ్, భారత్, రమేష్, సంతోష్, శశికళ, ప్రమీల, గంగుబాయి, జంగుదేవి, సీతారం, తిరుపతి, రుక్మాబాయి, దివ్య, లక్ష్మి, రాధాబాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ హామీతో సమ్మె విరమణ



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఐదు రోజులుగా చేస్తున్న సమ్మెను ఎమ్మెల్సీ దండె విఠల్ హామీతో శనివారం విరమించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి సమస్య తీసుకెళ్లామన్నారు. బకాయి ఉన్న రెండు నెలల వేతనాలను సోమవారం, ఒక నెల జీతాన్ని సెప్టెంబర్ 30 లోపు విడుదల చేస్తామన్నారు. విడుతల వారీగా ఇతర సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. ఆనంద్‌కుమార్, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సంజీవ్, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ‘ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్’



వంటలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

వాంకిడి: మండల కేంద్రంలోని పీఎంశ్రీ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో శనివారం ‘ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్’ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సమైక్యతను పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలలోని సాంప్రదాయాలను గౌరవించేలా విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి ఇతర రాష్ట్రాల్లోని సాంప్రదాయ వంటలను తయారు చేసి ప్రదర్శించారు. అలాగే విద్యార్థినులు వివిధ రకాల వేషధారణలలో నృత్యాలు చేసి అలరించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నటరాజ్ మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల సాంప్రదాయాలు గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, శైలజ, సంతోష్, శ్రీనివాస్, వెంకట్‌రావు, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో ఆకుకూరలు తీసుకోవాలి



పోషణమాసంలో పాల్గొన్న సూపర్‌వైజర్ పెంటుబాయి, అంగన్‌వాడీ టీచర్లు

ఆసిఫాబాద్: గర్భిణులు, బాలింతలు ఆహారంలో ఆకుకూరలతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెంటుబాయి అన్నారు. పోషణ మాసంలో రెండో రోజులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలో కూరగాయలు, పాలు, గుడ్లు, పౌష్టికాహారం ప్రదర్శించారు. నెల రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అరుణ, విజయలక్ష్మి, ఇందిర, రాజమ్మ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

దహెగాం: మండల కేంద్రంతో పాటు బీబ్రా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూర్య మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలు పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. పంచాయతీ కార్యదర్శి సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు మమత, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బతుకమ్మ సంబురాలు



కాగజ్‌నగర్‌టౌన్: శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న సిబ్బంది, విద్యార్థినులు

కెరమెరి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బొడ్డెమ్మలు పేర్చి విద్యార్థినులు నూతన వస్త్రాలు ధరించి బతుకమ్మ ఆడారు. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా నిర్వహించిన బతుకమ్మ సంబరాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం సమీప వాగుల్లో, చెరువుల్లో బతుకమ్మలు నిమజ్జనం చేశారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఆర్ఆర్‌ఓ కాలనీ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, ఆదర్శనగర్ శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందస్తుగా రంగురంగుల పూలతో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు బతుకమ్మను పేర్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో బతుకమ్మలను పెట్టి చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. కార్యక్రమంలో శిశుమందిర్ పాఠశాలల జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ కొత్తపల్లి అనిత, సులిగొండ భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌటాల/చింతలమానెపల్లి: కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తు బతుకమ్మ సంబురాలను విద్యార్థినులు, ఉపాధ్యాయులు జరుపుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ ఆడారు.

వాంకిడి: దసరా సెలవుల నేపథ్యంలో శనివారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో ముందస్తు బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి పాటలపై నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను తయారుచేసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ వేడుకలను జరుపుకున్నారు.



కెరమెరి: వాగులో నిమజ్జనం చేస్తున్న చిన్నారులు



చింతలమానెపల్లిలో..



వాంకిడి: ఖమాన పాఠశాలలో..

విద్యార్థుల ఇంటి బాట

- నేటి నుంచి దసరా సెలవులు



కెరమెరి: తల్లిదండ్రులతో ఇంటి బాట పడుతున్న రాంజీగూడ పాఠశాల విద్యార్థులు

కెరమెరి: జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద పని చేస్తున్న పాఠశాలలకు నేటి నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల అసెస్‌మెంట్ పరీక్షలు ముగిశాయి. దీంతో శనివారం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు చివరిరోజు కావడంతో జిల్లాలోని వివిధ పాఠశాలల్లోని విద్యార్థినులు బతుకమ్మ ఆడారు. జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, మోడల్ స్కూల్స్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ఎయిడెడ్, ప్రైవేటు, గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు జిల్లాలో 1268 ఉన్నాయి. ఇందులో చదువుతున్న విద్యార్థులు సుమారు 92 వేల మంది ఉన్నారు. వీరంతా దసరా సెలవులు కావడంతో ఇంటి బాట పట్టారు.

ఆసిఫాబాద్అర్బన్: ఆదివారం నుంచి దసరా సెలవులు కావడంతో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, జిల్లా కేంద్రంలోని హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఇంటిదారి పట్టారు. దీంతో ప్రధాన రహదారులు, హోటల్స్, బస్టాండ్‌లలో రద్దీ పెరిగింది.

‘డంప్‌యార్డ్ తరలించాలి’

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల పక్కనే ఉన్న డంప్‌యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని శనివారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ పట్టణంలోని చెత్త, జంతు కళేబరాలు పాఠశాల ప్రహరీ పక్కనే పడేయంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు చొరవ తీసుకొని డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు గణపతి, జక్కయ్య, తిరుపతి, సురేశ్, సదాశివ్, రాంజేంద్రప్రసాద్, శంకర్, వెంకన్న, వినోద్ పాల్గొన్నారు.

హైలెవల్ వంతెన నిర్మించరూ..!



వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వాగునీరు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రం నుంచి తిర్యాణి మండల కేంద్రానికి వెళ్లే రహదారిలో డోర్లి గ్రామం వద్ద చిన్నపాటి వర్షానికే ఉప్పొంగి వరద ప్రవహించడంతో సుమారుగా గంటపాటు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రం నుంచి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే వంతెనపైకి వరద చేరి ప్రవహించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న వంతెన ఎత్తు చిన్నదిగా ఉండడంతో సమస్య ఉత్పన్నమవుతుందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దీనిపై హైలెవల్ వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు అంతరాయం

తిర్యాణి: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఆసిఫాబాద్ నుంచి మండలంలోని ఉల్లిపిట్ట గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగు లోలెవల్ వంతెనపై వాగు ఉప్పొంగి ప్రవహించడంతో దాదాపు గంటపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

‘ఆసరా పింఛన్లు పెంచాలి’



కెరమెరి: పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కెరమెరి: ఆసరా పింఛన్లను పెంచాలని వీహెచ్పీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శి గణేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారంలోకి రాగానే అన్ని రకాల పింఛన్లు పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు తిరుసుల్ల సాయి, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పార్ల వెంకటేశ్, లబ్ధిదారులు పరమేశ్వర్, శంకర్, బాలాజీ, బాపూరావు, మైను తదితరులు ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలని వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు రాజేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు పింఛన్లు పెంచి అమలు చేయాలని శనివారం గ్రామపంచాయతీల కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. రెబ్బెన పంచాయతీ కార్యదర్శి రవీందర్‌కు వినతిపత్రం అందచేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నాయకులు లింగంపెల్లి ప్రశాంత్, ఎం.రాజయ్య, లక్ష్మి, భరత్, బొజ్జరావు, జంగంపెల్లి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ గిరిజన క్రీడా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సోయం గంగుబాయి, సిడం వైష్ణవి, తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్‌లోని నిజాం కళాశాల మైదానంలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరుగనున్న 17వ హెచ్‌ఎఫ్ఐ మినీ బాలబాలికల హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుడిమెత జంగు, పాఠశాల పీడీ మీనారెడ్డి తెలిపారు. కోచ్ అరవింద్‌ను శనివారం డీటీడీఓ రమాదేవి, జిల్లా హ్యాండ్‌బాల్ ఇన్‌చార్జి అరిగెల మల్లిఖార్జున్, గిరిజన క్రీడల అధికారి షేకు, ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, సిబ్బంది అభినందించారు.